క్లుప్తంగా

నల్లమారమ్మ గరగల ఊరేగింపు



గరగలను ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు

మాకవరపాలెం: నల్లమారమ్మతల్లి పండగ నేపథ్యంలో అమ్మవారి గరగలను ఘనంగా ఊరేగించారు. కొండలఅగ్రహారంలో ఈ నెల 20న నల్లమారమ్మ పండగ నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం డప్పులతో అమ్మవారి గరగలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. పండగ రోజు మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేయనున్నట్టు ఆలయ ధర్మకర్త గూడూరు జానకిరాజు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిటికెల రమణ, పార్టీ నేత పోలిరెడ్డి రమణ తెలిపారు.

పాఠశాలల్లో భాషోత్సవాలు

మాకవరపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో భాషోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఎంఈవో మూర్తి తెలిపారు. మంగళవారం అన్ని పాఠశాలల్లోనూ ఆంగ్ల భాషోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆంగ్లంపై పట్టు సాధించాలన్నారు. బుధవారం హిందీ, గురువారం తెలుగు భాషోత్సవాలు నిర్వహించనున్నట్టు వివరించారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

మాకవరపాలెం: మండలంలో ఖాళీగా ఉన్న అధికారుల పోస్టులను భర్తీ చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఓబీసీ చైర్మన్ బొంతు రమణ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. మండల స్థాయిలో ఇన్‌చార్జులతోనే సేవలు కొనసాగుతున్నాయన్నారు. ప్రధానంగా నర్సీపట్నం తహసీల్దార్ ఇక్కడ ఇన్‌చార్జ్‌గాను, ఎంపీడీవో లేకపోవడంతో ఈవోపీఆర్డీకే ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారన్నారు. పీఆర్ జేఈ, మండల సర్వేయర్, ఒక ఎంఈవో పోస్టు సైతం ఇన్‌చార్జ్‌లతోనే కొనసాగుతున్నాయన్నారు. దీంతో ప్రజలకు సకాలంలో సేవలు అందడం లేదని, ఉన్నతాధికారులు స్పందించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

మాకవరపాలెం: గ్రామ కంఠం భూమిలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను అడ్డుకోవాలని భీమబోయినపాలెం గ్రామస్తులు మంగళవారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ రామారావుకు ఫిర్యాదు చేశారు. భీమబోయినపాలెం రెవెన్యూ పరిధి ఎస్సీ కాలనీలో సర్వే నంబర్ 88లో గ్రామకంఠం భూమి ఉందని, దీనిని కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సీ కాలనీలో ఇళ్ల స్థలాలు లేని వారు ఉన్నారని, అర్హులకు ఈ స్థలాన్ని అందజేయాలని కోరారు.


పశుబీమా పథకంతో మేలు



ఏడీ నాయుడు

కె.కోటపాడు: ఆవులు, గేదెలకు పశు బీమా పథకం అమలు చేస్తున్నట్లు స్థానిక పశు సంవర్ధక శాఖ ఇన్‌చార్జ్ అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్.వై.నాయుడు తెలిపారు. దీని కోసం పాడి రైతులు రైతు సేవా కేంద్రాల్లో పశువైద్య సహాయకులను సంప్రదించాలన్నారు. ఈ బీమా ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు వర్తించనున్నట్లు తెలిపారు. బీమా కలిగిన పశువులు మూడేళ్ల లోపు మరణిస్తే నగదు అందించనున్నట్లు తెలిపారు. పశువు ఖరీదును బట్టి రూ.15 వేల నుంచి రూ.50 వేల వరకూ బీమా చేయించనున్నట్లు తెలిపారు. బీమా రాయితీ పోను రైతుల వాటాను చెల్లిస్తే పథకం వర్తిస్తుందన్నారు. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంటి శస్త్ర చికిత్సలకు 33 మంది ఎంపిక



కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ సిబ్బంది

కె.కోటపాడు: కంటి సమస్యలకు ప్రాథమిక దశలోనే మెరుగైన వైద్యం పొందాలని సంఘమిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రధాన కార్యదర్శి బొంతు మంగపతి తెలిపారు. సంఘమిత్ర ఆధ్వర్యంలో మంగళవారం గొల్లలపాలెం గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామానికి చెందిన 211 మంది రోగులకు ఆప్తాలమిస్టులు వైష్ణవి, గీతాశ్రీ, లక్ష్మణశ్రీ కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. వీరిలో 33 మందిని కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని విశాఖ ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో క్యాంప్ కోఆర్డినేటర్ ఆర్.స్వాములు, గ్రామస్తులు పల్ల శ్రీను, రాజు, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం



మొండిపీథిలో మురుగుకూ పలా దర్శన మిస్తున్న డ్రైనేజీ





ఇంటి ముంగిట నిలిచిపోయిన మురుగునీరు

పరిశుభ్రతలో ఆదర్శంగా నిలవాల్సిన దేవరాపల్లి మేజర్ పంచాయతీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. పట్టణాలతో పోటీపడుతున్నట్టుగా ఇక్కడ మురుగు దర్శనమిస్తోంది. ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారాలతో దుర్గంధం వెలువడి ఈగలు, దోమలకు ఆవాసంగా మారింది. దాంతో రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- దేవరాపల్లిలో అధ్వానంగా మురుగు కాలువలు
- చెత్తా చెదారంతో పూడిక పోయిన వైనం
- తీవ్ర దుర్గంధంతో ప్రజల అవస్థలు దోమలు స్వైర విహారం

దశాబ్దాలుగా డ్రైనేజీ వ్యవస్థ అధ్వానం..

దశాబ్దాలుగా డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచకపోవడంపై స్థానిక పంచాయతీ పాలకులపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దోమ కాటుతో తరుచూ అనారోగాల బారిన పడుతున్నా, పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకుంటే తమ ఆరోగ్యంపై ప్రభావం చూపే ప్రమాద ముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు కనీసం దోమల నివారణకు పిచికారీ లేదా ఫాగింగ్ సైతం చేపట్టక పోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మేజర్ పంచాయతీ దేవరాపల్లిలో 10 వేలకు పైగా జనాభా ఉండగా, 2,500 ఇళ్లు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు, పంచాయతీ పాలకులు డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించాలని ముక్త కంఠంతో కోరుతున్నారు.

దేవరాపల్లి: అసలే అరకొరగా ఉన్న డ్రైనేజీలు, వీటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో మేజర్ పంచాయతీ దేవరాపల్లిలో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. డ్రైనేజీల నిర్మాణాన్ని పంచాయతీ పాలకులు పూర్తిగా విస్మరించారు. దాంతో కొన్ని వీధుల్లో డ్రైనేజీలు ఉన్నా, మురుగునీరు ప్రవహించని పరిస్థితి నెలకొంది. పలు వీధుల్లో డ్రైనేజీలు చెత్తా చెదారాలతో పూడికపోయి కంపు కొడుతున్నాయి. నెలల తరబడి పూడికలు తొలగించకపోవడంతో మురుగు కూపంలా దర్శనమిస్తున్నాయి. తీవ్ర దుర్గంధం వెదజల్లడంతో మేజర్ పంచాయతీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువలు దోమలకు స్థావరాలకు మారాయి. డ్రైనేజీల్లో చెత్తా చెదారం పేరుకుపోవడంతో దోమలు రేయింబవళ్లు అనే తేడా లేకుండా స్వైర విహారం చేస్తున్నాయి. దేవరాపల్లి ప్రజలకు దోమల కంటి మీద నిద్ర లేకుండా చేస్తున్నాయి. దోమల చక్రాలు లేదా గుడ్‌నైట్ లేదా ఆలౌట్ తదితర దోమల నివారణ మార్గాలను అన్వేషిస్తే తప్పా కంటి నిండా నిద్రపోయే పరిస్థితి లేదు.



రామాలయం సమీపంలో డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్త

పూడిక తొలగించేందుకు చర్యలు



రెండు వారాల క్రితమే పంచాయతీ కార్యదర్శిగా ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించాను. అన్ని వీధుల్లో పర్యటించి డ్రైనేజీ వ్యవస్థను పరిశీలిస్తాను. అవసరమైతే స్పెషల్ డ్రైవ్ చేపట్టి డ్రైనేజీల్లో పూడికలు తొలగించేందుకు చర్యలు చేపడతాను. దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టేందుకు కృషి చేస్తాను.

–కె. సుధాకర్‌బాబు, ఇన్‌చార్జి పంచాయతీ సెక్రటరీ, దేవరాపల్లి

అవయవదానంతో మనిషి సజీవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్

చోడవరం రూరల్: మనిషి మృతి చెందినా సజీవుడిగా ఉంచేది అవయవ దానమని ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని జాతీయ సేవా పథకం మూడు యూనిట్లు, సావిత్రిబాయి పూలే స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం అవయవదానం పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ప్రారంభిస్తూ ప్రమాదాలు, తదితర విపత్తుల కారణంగా ప్రాణాలపైకి తెచ్చుకునే వారికి అవయవదానం ఒక్కొక్కసారి ప్రాణదానంగా నిలుస్తుందని తెలిపారు. సావిత్రిబాయి పూలే సంస్థ ప్రతినిధి బాలు మాట్లాడుతూ అవయదానం మరొకరిక ప్రాణదానం అన్న నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కోరారు. కన్యాకుమారి మాట్లాడుతూ తాను కిడ్నీ దానం చేయడానికి ముందుకు వస్తే తన కుటుంబమే వ్యతిరేకించినా తాను ధైర్యంగా ముందుకు సాగానని తెలిపారు. టైపు ఇన్స్టిట్యూట్ బాబ్జీ, ఉపన్యాసకులు మల్లిబాబు, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు రత్నభారతి, పిచ్చమ్మ, డి.మాల్యాద్రి పాల్గొన్నారు.

చురుగ్గా సీసీ రోడ్డు పనులు



కోనేరు గట్టు సమీపంలో సీసీ రోడ్డు పనులు

మాడుగుల రూరల్: మండలంలో కె.జె.పురంలో సీసీ రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఐదో వార్డులో మూడు లక్షల రుపాయలతో ఈ పనులను కూటమి నాయకులు ఆధ్వర్యంలో చేపట్టారు. స్థానిక కోనేరు గట్టు సమీపంలో పంచాయతీ ఆర్థిక సంఘం నిధులు నుంచి ఈ పనులు చేపట్టినట్లు సర్పంచ్ జామి రమణబాబు తెలిపారు.

అంగన్‌వాడీ పిల్లలకు గుణాత్మక విద్య

కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ ప్రారంభం



కె.కోటపాడు: జ్ఞానజ్యోతి కార్యక్రమంలో ఎంఈవోలు ప్రసాద్, సత్యనారాయణ



వడ్డాది హైస్కూల్‌లో అవగాహన కల్పిస్తున్న ఎంఈవో



రోలుగుంట: శిక్షణ ఇస్తున్న ఎంఈవో జగ్గారావు



మాట్లాడుతున్న ఎంఈవో



మాట్లాడుతున్న నాతవరం ఎంఈవో -2 వరహాలబాబు



మాకవరపాలెం: శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈవో మూర్తి



మాడుగులలో శిక్షణ ప్రారంభిస్తున్న ఎంఈవోలు పాండురంగారావు, దేముడమ్మ, సీడీపీవో శ్రీదేవి



మాడుగుల హైస్కూల్‌లో శిక్షణకు హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలు

బుచ్చెయ్యపేట: అంగన్‌వాడీ పిల్లల బోధనపై ప్రత్యేక దృష్టిట్ సారించాలని ఎంఈవో కాశీ విశ్వేశ్వరరావు తెలిపారు. జ్ఞానజ్యోతిలో భాగంగా మంగళవారం వడ్డాది కోవెల అప్పనదొర జెడ్పీ హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణను ఐసీడీఎస్ పీవో పుష్పాదేవితో కలిసి ఆయన ప్రారంభించారు. 2020 బాల్య సంరక్షణ విద్యకు అధిక ప్రాధాన్యం కల్పిస్తుందని, అంగన్‌వాడీ కార్యకర్తలు తమ నైపుణ్య సామర్థ్యాన్ని పెంపొందించుకుని పిల్లలకు గుణాత్మకమైన విద్య అందేలా చూడాలన్నారు. మూడేళ్ల కాలంలో 120 రోజుల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న టీచర్లకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఇందులో ఉత్తీర్ణత సాధించిన వారికి జ్ఞానజ్యోతి సర్టిఫికెట్లు అందించి ప్రీప్రైమరీ పాఠాలు బోధించేలా అర్హత కల్పిస్తారన్నారు. చోడవరం, రావికమతం, బుచ్చెయ్యపేట మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు హెచ్‌ఎం శేషుబాబు, డీఆర్పీలు శేషగిరిరావు, దేగల నారాయణ, పీవీ నారాయణ, గొలుగొండ శ్రీనివాసరావు శిక్షణ అందించారు.

కె.కోటపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ చిన్నారులు చదువు పై ఆకర్షితులయ్యేలా బోధించాలని ఎంఈవోలు డీవీడీ ప్రసాద్, సత్యనారాయణ తెలిపారు. స్థానిక హైస్కూల్‌లో జ్ఞానజ్యోతిలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఎంఈవోలు మాట్లాడుతూ తెలుగు, గణితం సులభంగా అర్థమయ్యేలా బోధించాలన్నారు. ఐసీడీఎస్ పీవో మంగతాయారు పాల్గొన్నారు.

నాతవరం: విద్యా విధానాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా అంగన్‌వాడీ కార్యకర్తలు పని చేసేందుకే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ఎంఈవోలు సత్యనారాయణ, కామిరెడ్డి వరహాలబాబు తెలిపారు. స్థానిక హైస్కూల్‌లో జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులను ప్రారంభించారు. శిక్షణలో చెప్పిన విషయాలను క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గొలుగొండ ఐసీడీఎస్ పీవో శ్రీగౌరీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, నాగజ్యోతి, సూర్యప్రభ, సీఆర్పీలు వెంకటలక్ష్మి, సత్యవేణి, పాలుపర్తి నాగేశ్వరరావు, గోవింద్, ఎమ్మార్సీ అధికారులు అంకంరెడ్డి శ్రీనివాసనాయుడు, సాంబనాయుడు, శిక్షణ తరగతులు కోఆర్డినేటర్లు కూంద్రపు అర్జున, కిశోర్ పాల్గొన్నారు.

మాకవరపాలెం: మండలంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు స్థానిక ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి కార్యక్రమంపై శిక్షణ ప్రారంభించారు. ఎంఈవోలు జాన్‌ప్రసాద్, పి.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ అంగన్‌వాడీ పిల్లలకు భాష, గణిత అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం రిసోర్స్ పర్సన్‌లు రాము, కరుణ, వరహాలబాబు పునాది అభ్యసనం, గణితంలో బేసిక్ భావనలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం అచ్యుతరామయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమణమ్మ, సరోజిని పాల్గొన్నారు.

మాడుగుల: అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యా ప్రమాణాలు పెంచడానికే జ్ఞానజ్యోతి శిక్షణ ఇస్తున్నట్లు ఎంఈవోలు పాండురంగారావు, దేముడమ్మ, సీడీపీవో సీహెచ్ శ్రీదేవి తెలిపారు. మంగళవారం స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఏడాదికి 12 రోజులు శిక్షణ తరగతులు, 28 రోజులు ఆన్‌లైన్ తరగతులు సర్వశిక్ష అభియాన్, ఐసీడీఎస్ సంయుక్తంగా నిర్వహిస్తాయన్నారు. రిసోర్సుపర్సన్లు మణికంఠ, కృష్ణ, రవి, సూపర్‌వైజర్లు నారాయణమ్మ, ఈశ్వరమ్మ, సీఆర్పీలు వొమ్మలి అచ్యుతరావు, బొబ్బిలి హరికృష్ణ, కాశీ సురేష్, నిద్దాన సంధ్య, ఎన్ శారద, ఎమ్మార్సీ సిబ్బంది రాజు, నాగేంద్ర పాల్గొన్నారు.

రోలుగుంట: బుచ్చింపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. వీటిని ఎంఈవో జగ్గారావు ప్రారంభించారు. కోర్సు డైరెక్టర్‌గా స్థానిక హెచ్‌ఎం శేఖర్ వ్యవహరించారు. రోలుగుంట, బుచ్చింపేట సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, సూపర్‌వైజర్లు రమ్య, హేమ పాల్గొన్నారు.

చోడవరం రూరల్: ప్రాథమిక, సెకండరీ విద్యలో పునాది అభ్యసనం నాణ్యతను పెంపొందించడానికే సాల్ట్ కార్యక్రమమని ఎంఈవోలు సింహాచలం, తిరుపతిరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంఈవోలు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఇంప్లిమెంటేషన్ సొసైటీ ఆధ్వర్యంలో సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్(సాల్ట్) కార్యక్రమాన్ని రూపొందించినట్టు తెలిపారు. రిసోర్స్ పర్సన్లుగా ఎన్.గణేష్, ఎ.రవికుమార్, బి.సురేష్ వ్యవహరించారు. హెచ్‌ఎం రామిరెడ్డి, సీడీపీవోలు అనిత, శ్రీదేవి, సీవీఆర్పీ కె.వి.ఎం. నాయుడు పాల్గొన్నారు.

వచ్చే నెలాఖరుకు అభివృద్ధి పనులు పూర్తి

పంచాయతీ రాజ్ శాఖ జేఈ వెంకటేశ్వరమ్మ



మాసయ్యపేట వద్ద రోడ్డు పనులు నాణ్యతను పరిశీలిస్తున్న జేఈ వెంకటేశ్వరమ్మ

నాతవరం: మండలంలో వివిధ దశల్లో ఉన్న అభివృద్ధి పనులను మార్చి నెలాఖరుకు శత శాతం పూర్తి చేస్తామని పంచాయతీరాజ్ శాఖ జేఈ వెంకటేశ్వరమ్మ అన్నారు. మండలంలో మాసయ్యపేట నుంచి కాకినాడ జిల్లా కోటనందూరు మండలం మధ్య రోడ్డు పనులు నాణ్యతను ఆమె మంగళవారం పరిశీలించారు. నిబంధనలు అనుసరించి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టరుకు సూచించారు. నాణ్యమైన మెటీరియల్ ఉపయోగించి పనులు వేగవంతం చేయాలన్నారు. మండలంలో 124 పనులకుగాను రూ. 12.3 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఇంతవరకు 62 రోడ్డు పనులు పూర్తి చేశామని, ఈ నెలాఖరుకు 30 పనులు పూర్తి అవుతాయన్నారు. మిగతా పనులు తారురోడ్లు కావడంతో మార్చి నాటికి పూర్తి చేస్తామన్నారు. ఇంతవరకు పూర్తి చేసిన వాటికి రూ. 3.30 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బిల్లులు సకాలంలో చెల్లింపులు చేస్తే పనులు మరింత వేగవంతంగా చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్స్‌పెక్టరు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంటు సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎమ్మెల్సీ ఎన్నిక



సెక్టోరియల్ ఆఫీసర్లతో సమావేశమైన ఆర్డీవో రమణ

నర్సీపట్నం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని అసిస్టెంట్ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, ఆర్డీవో వి.వి.రమణ అన్నారు. మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ జరగనున్నందున పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలన్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా డివిజన్ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సెక్టోరియల్ అధికారులను ఆదేశించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కాగా అమలు చేయాలన్నారు. డివిజన్‌లోని పోలింగ్ నిర్వహణకు ఐదు రూట్లు ఏర్పాటు చేశామన్నారు. పోలీసు సెక్టోరియల్ బృందాలు 5, సెక్టోరియల్ ఆఫీసర్ల బృందాలు 5, నియమించామన్నారు. ఎవరికీ కేటాయించిన విధులను వారు సమక్రమంగా నిర్వర్తించాలన్నారు. పోలింగ్ దగ్గర పడుతున్నందున ముందుగా పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, మౌలిక సదుపాయాలు లేకపోతే వెంటనే కల్పించాలన్నారు. ఎవరైనా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎలక్షన్ డీటీ సుధారాణి పాల్గొన్నారు.

ఘనంగా పైడితల్లమ్మ పండగ



పైడితల్లమ్మను దర్శించుకుంటున్న భక్తులు



చిన అప్పనపాలెంలో మందుగుండు సామగ్రి కాల్పులు

బుచ్చెయ్యపేట: మండలంలో చినఅప్పనపాలెంలో గ్రామదేవత పైడితల్లమ్మ పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. దిబ్బిడి, పి. భీమవరం, గొన్నవానిపాలెం, బుచ్చెయ్యపేట, పోలేపల్లి, నేతవానిపాలెం, బంగారుమెట్ట, వడ్డాది తదితర గ్రామాల భక్తులు పాల్గొన్నారు. రాత్రికి నేల డ్యాన్స్, డప్పువాయిద్యాల నడుమ అమ్మవారి సంబరం సాగింది. గంట పాటు సాగిన భారీ మందుగుండు కాల్పులు ఆకట్టుకున్నాయి. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తుల్ని అలరించాయి. ఆలయంకు భక్తులకు యువకులు ప్రసాదాలు, మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లు ఉచితంగా అందించారు.

గ్రామాల్లో పారదర్శకంగా సేవలందించాలి

4 గ్రామాల్లో ఎంపీడీవో సువర్ణరాజు ఆకస్మిక తనిఖీలు



వాకపల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో సువర్ణరాజు



కలిగొట్లలో చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో సువర్ణరాజు

దేవరాపల్లి: గ్రామ స్థాయిలో అధికారులు పారదర్శకంగా ప్రజలకు సేవలందించాలని ఎంపీడీవో ఎం.వి. సువర్ణరాజు సూచించారు. మండలంలోని వాకపల్లి, తిమిరాం, కలిగొట్ల, బోయిలకింతాడ గ్రామాల్లో మంగళవారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పర్యవేక్షించి, కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించి, ఎరువుల తయారీపై దృష్టి సారించాలని సిబ్బందికి ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రాధాన్యత కల్పించాలని ఆయా గ్రామాల పంచాయితీ సెక్రటరీలకు సూచించారు. సచివాలయం, రైతు సేవా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను తనిఖీ చేసి ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించకుండా ప్రజలకు సేవలందించాలని సూచించారు. స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ వి.పి.వి. త్రినాథ్, పంచాయితీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పశుగణనపై తనిఖీలు



అర్జునగిరిలో రికార్డుల పరిశీలన

చీడికాడ: 21వ పశుగణనపై మాడుగుల ఏరియా ఏడీ డాక్టరు చిట్టినాయుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మంగళవారం ఆయన అర్జునగిరి, తురువోలు రైతు సేవా కేంద్రాల్లో పశుగణన రికార్డులను పరిశీలించారు. ఈ మేరకు ఇప్పటి వరకు ఎన్ని ఇళ్లను సర్వే పూర్తి చేశారని వెటర్నరీ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో సర్వే చేసిన ఇళ్లను సందర్శించి నమోదు చేసిన డేటా సరిచూశారు. ఇప్పటి వరకు మండలంలో 50 శాతం ఆవులు, గేదెలు, 70 శాతం గొర్రెలు, మేకలు గణన పూర్తయినట్లు చెప్పారు.

దివ్యాంగుడికి సాయం

కశింకోట: నూతలగుంటపాలెం శివారు త్రిపురవానిపాలేనికి చెందిన దివ్యాంగుడు పిల్లి బోయిన రాముకు రూ.10 వేల సాయాన్ని పల్లపు సోమవరం మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు అందజేశారు.